# మనం

## అనంతపురం / శ్రీ సత్యసాయి జిల్లా

శనివారం - 21 - మార్చి - 2026 : పేజీలు 8


## విమానాశ్రయ భద్రతపై సమీక్ష సమావేశం

– జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్‌ప్రసాద్, జిల్లా ఎస్పీ. ఎస్ సతీష్‌కుమార్



**పుట్టపర్తి మార్చి 20 మనం న్యూస్ :** పుట్టపర్తి సత్యసాయి విమానాశ్రయంలో పటిష్టమైన భద్రతను కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం విమానాశ్రయంలో నిర్వహించిన ఎయిర్‌పోర్టు భద్రతా కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. భద్రతా పరమైన సమస్యలు తలెత్తినప్పుడు ప్రభుత్వ అధికారులు,

మిగతా 2లో

## రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర మంత్రులు టి.జి.భరత్, పయ్యావుల కేశవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ



**అనంతపురము, మార్చి 20 మనం న్యూస్ ప్రతినిధి:** జిల్లాలోని ముస్లిం సోదర, సోదరిమణులకు జిల్లా ఇంచార్జి మంత్రి టీజీ. భరత్,రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్,ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ,జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, పలువురు ఎంఎల్ఏలు, ఎమ్మెల్సీలు,జేసి సి.విష్ణుచరణ్, డిఆర్ఓ మలోల తదితర ప్రముఖులు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈద్-ఉల్-ఫితర్ అన్నది ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండుగయని, ఇది ముస్లింలు పవిత్ర ఉపవాసాలతో గడిపే రంజాన్ నెలకు ముగింపు రోజన్నారు. అలాగే సఖ్యతకు, త్యాగానికి ప్రతీకయని, ముస్లింలందరూ సుఖ సంతోషాలతో సుహృద్భావ, సామరస్య,శాంతియుత వాతావరణంలో పండుగను జరుపు కోవాలని వారు ఆకాంక్షించారు.



## వంట గ్యాస్ వినియోగదారులు ఆందోళన చెందవద్దు

- ఎవరూ గ్యాస్ ఏజెన్సీ వద్ద వేచి ఉండరాదు
- అనవసరంగా గ్యాస్ బుక్ చేయవద్దు
- ఇంటి వద్దకే గ్యాస్ డోర్ డెలివరీ చేయబడుతుంది
- యథావిధిగా గ్యాస్ సరఫరా జరుగుతుంది
- కలెక్టర్ ఓ.ఆనంద్



**అనంతపురం. మార్చి 20 మనం న్యూస్ ప్రతినిధజ:** వంట గ్యాస్‌పట్ల ఆందోళన చెంద రాదనీ, ఆన్ లైన్ లో బుక్ చేసుకున్న వారికి సకాలంలో గ్యాస్ పంపిణి చేస్తున్నామని, కనుక ఎవరూ గ్యాస్ ఏజెన్సీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అన్నారు. శుక్రవారం ఆయన అనంతపురం రూరల్ లోని ఆలమూరు వద్దనున్న ఉమా భారతీ ఇండియన్ గ్యాస్ గోడౌన్, నగరంలోని పవన్ గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ గ్యాస్ పట్ల వినియోగదారులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, సరిపడా గ్యాస్ నిల్వలున్నాయని తెలిపారు. ఆన్లైన్లో బుక్ చేసుకున్న వారికి సకాలంలో గ్యాస్ పంపిణీ చేస్తున్నామని స్పష్టం చేశారు. అవసరం ఉన్న వినియోగదారులకు గ్యాస్ పంపిణీ చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. యధావిధిగా గ్యాస్ సరఫరా చేయడం జరుగుతోందన్నారు. గ్యాస్ పంపిణీలో ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. వినియోగదారులు

మిగతా 2లో

## ఉద్యోగాల కల్పన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

- మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ విడుదల చేశారు.
- తాజా జాబ్ క్యాలెండర్ పై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత స్పందన.
- వైసిపి ప్రభుత్వ హయాంలో వై. ఎస్. జగన్ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్.
- మీరు జాకీ పరిశ్రమను వెళ్లగొడితే మేము రేమాండ్స్ ను తెచ్చామన్న సునీత.

**అనంతపురం. మార్చి 20 మనం న్యూస్ ప్రతినిధి:** రాష్ట్రానికి పెట్టుబడులు రావాలన్నా... ఉద్యోగాల కల్పన జరగాలన్నా...అది ఒక ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తాజాగా విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఇచ్చిన ఉగాది కానుకగా ఆమె అభివర్ణించారు. శుక్రవారం రామగిరి మండలం వెంకటాపురంలోని తన నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ముందు పాదయాత్ర చేస్తున్న సమయంలో నారా లోకేష్ నిరుద్యోగుల సమస్యల గురించి తెలుసు కున్నారన్నారు. తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక ప్రణాళికాబద్ధంగా ఉద్యోగాలు కల్పన జరుగుతోందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగాల్ని ప్రాధాన్యతల వారిగా భర్తీ చేస్తున్నారని ఎమ్మెల్యే సునీత అన్నారు. అలాగే దేశ విదేశాల్లో పర్యటిస్తూ పెద్ద ఎత్తున రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తున్నారన్నారు. దీని వలన ఈ 20 నెలల్లో 6,28,347 ఉద్యోగాలను యువతకు అందించడం జరిగిందన్నారు. వీటితో పాటు రూ.23 లక్షల కోట్ల పెట్టుబడితో 25 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా వివిధ కంపెనీలతో ఒప్పందాలు జరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించి భారీగా టీచర్ పోస్టులను భర్తీ చేసిందని గుర్తు చేశారు. గత ఐదేళ్లలో జగన్మోహన్ రెడ్డి ఒక్క టీచర్ పోస్ట్ అయినా భర్తీ చేశారా అని ఆమె నిలదీశారు. ఇప్పుడు మరోసారి డీఎస్సీని, జూనియర్ లెక్చరర్ పోస్టుల కోసం 3,000 ఖాళీలను తమ ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఉన్నత విద్యను బలోపేతం చేసే దిశగా వివిధ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 1,500 అధ్యాపక పోస్టులను భర్తీ చేస్తుందన్నారు. పరిపాలనా విభాగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాల కోసం దాదాపు 600 పోస్టులతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం 1,000 పోలీస్ కానిస్టేబుల్, 400 ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపిందన్నారు. ఇందులో కూడా ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పారదర్శకతతో నియామకాలు

మిగతా 2లో



## కళ్యాణదుర్గం పట్టణంలో చిరుతల సంచారం కలకలం




**కళ్యాణదుర్గం టౌన్ మార్చి 20 మనం న్యూస్:** పట్టణంలోని ముదిగల్లు రోడ్, కంకర మిషన్ ఎదుట ఉన్న కొండ ప్రాంతంలో చిరుతలు శుక్రవారం సాయంత్రం సంచరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అక్కడ రెండు చిరుతలను గమనించినట్లు ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

మిగతా 2లో

## రంజాన్ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రత్యేక చొరవ



- ఈద్గా మైదానంలో ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన ఎమ్మెల్యే దగ్గుపాటి
- ముస్లిం మత పెద్దలు, మున్సిపల్ అధికారులతో కలిసి ఏర్పాట్ల పరిశీలన.
- తాగునీరు, షామియానాలు ఏర్పాటు చేయాలని ఆదేశం
- ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

**అనంతపురం. మార్చి 20 మనంన్యూస్ ప్రతినిధి:** రంజాన్ పండుగ నేపథ్యంలో ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చూడాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశించారు. ప్రతి ఏటా రంజాన్ పర్వదినాన అనంతపురం నగరంలోని ఈద్గా మైదానాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తుంటారు. అశోక్ నగర్, ఇందిరానగర్ ల లోని ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తుంటారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది ముస్లింలు పాల్గొంటుంటారు. ఈ నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎమ్మెల్యే దగ్గుపాటి శుక్రవారం మున్సిపల్ అధికారులు, మత పెద్దలు, టిడిపి మైనార్టీ నాయకులతో కలిసి ఈద్గా

మిగతా 2లో

## కళ్యాణదుర్గం పట్టణంలో చిరుతల సంచారం కలకలం

**మొదటిపేజీ తరువాయి....**

ఈ రహదారి ఎప్పుడూ రద్దీగా ఉండి, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతం కావడంతో స్థానికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. కొండకు ఆనుకుని ఇళ్లు ఉండటంతో ఆ పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. అటవీశాఖ అధికారులు తక్షణమే స్పందించి, చిరుతలను పట్టుకుని దట్టమైన అడవుల్లో విడిచిపెట్టాలని, ప్రజలకు భద్రత కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

## విమానాశ్రయ భద్రతపై సమీక్ష సమావేశం

**మొదటిపేజీ తరువాయి....**

విమానాశ్రయ నిర్వాహకులు పరస్పర సహకారంతో సమాచారాన్ని పంచుకోవాలి.అత్యవసర సమయాల్లో ఏ శాఖ ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.విమానాశ్రయ భద్రతా ప్రమాణాలపై సిబ్బంది ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను కలెక్టర్ వీక్షించారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, ఆర్డీఓ సువర్ణ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.





## శ్రీ తుమ్మల మారమ్మకు జ్యోతుల ఉత్సవం

**గుడిబండ మార్చి 20 మనం న్యూస్:** గుడిబండలో ఉన్న శ్రీ తుమ్మల మారమ్మకు శుక్రవారం గుడిబండ గ్రామస్తులు ఉగాది పండుగను పురస్కరించుకొని అమ్మవారికి జ్యోతుల ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు పిండి పదార్థాలతో కూడిన జ్యోతులను తలపై ఉంచుకొని డప్పు వాయిద్యాల మధ్య ఊరేగుతూ మండల కేంద్రానికి కిలోమీటర్ దూరంలో ఉన్న అమ్మవారి గుడికి చేరుకొని జ్యోతులను అర్పించారు. గ్రామ పెద్దల సహకారంతో ప్రతి ఏడాది అమ్మవారికి జ్యోతుల ఉత్సవం కార్యక్రమాన్ని గ్రామస్తులు నిర్వహిస్తారు. పురాతన కాలంనాటి నుండి నేటి వరకు నిత్య పూజలను అర్చకులు నిర్వహిస్తున్నారు. చుట్టుప్రక్కల గ్రామాలతో పాటు కర్ణాటక ప్రాంత వాసులు కూడా అమ్మవారి దర్శనార్థం వచ్చి మ్రొక్కులు తీర్చుకుంటారని శుక్రవారం అమ్మవారికి పంచామృత అభిషేకం, సహస్రనామ పారాయణం, దేవి ఖడ్గ మాల స్తోత్రం తో పాటు రంగురంగుల పూలతో అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించినట్లు అర్చకులు తిప్పేస్వామి తెలిపారు.

## నిర్ణీత సమయానికి ఈద్గాకు చేరుకోవాలి... ప్రభుత్వ ఖాజీ సాబ్‌లు




**కనేకల్ మార్చి 20 మనంన్యూస్:** పట్టణ సమీపంలోని కణేకల్ రోడ్డు ఈద్గా మైదానంలో శనివారం ఉదయం 7:15 నిముషాలకు అలాగే ఈద్ -ఉల్ -ఫితర్ నమాజ్ కొరకు బళ్ళారి రోడ్డు ఈద్గా మైదానంలో 8:30 నిముషాలకు నిర్ణయించడం జరిగింది. కావున ముస్లింలు నిర్ణత సమయానికి హాజరు కావాలని ప్రభుత్వ ఖాజీ సాబ్ లు మొహమ్మద్ సైపుల్ల, అతికుర్ రెహమాన్ విజ్ఞప్తి చేసారు.

## టిడిపి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ను పార్టీ నుండి సస్పెండ్ చేయాలి

**డ్రగ్స్ గంజాయి మాదకద్రవ్యాలను నిలువరించడంలో కూటమి ప్రభుత్వం వైఖరి ఏంటి?**

**డ్రగ్స్ తో యువత జీవితాలు సర్వనాశనం**



**రాయదుర్గం మార్చి 20 మనం న్యూస్:** డ్రగ్స్ కేసులో పట్టుబడిన తెలుగుదేశం పార్టీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌ను వెంటనే సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు చేపట్టాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్ ) అనంతపురం జిల్లా సమితి అనంతపురం జిల్లా అధ్యక్షుడు కావలికు ట్రేస్ డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి మాదకద్రవ్యాలను అడ్డగించిన యువతను నిర్ధాక్షిణంగా చంపుతున్న గంజాయి ముఠాలు,మరి డ్రగ్స్ కేసులో పట్టుబడిన తెలుగుదేశం పార్టీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పై చర్యలు తీసుకోకుండా కూటమి పార్టీ వైఖరీ ఏమటి, తక్షణమే పార్టీ నుండి సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ముస్లీం కుటుంబ సబ్యలకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు

**- కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్**



**కదిరి, మార్చి20మనంన్యూస్:** "పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముస్లిం కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలును శుక్రవారం తెలిపారు. అయన మాట్లాడుతూ:- క్రమశిక్షణదాతృత్వం, సోదరభావాన్ని చాటిచెప్పే ఈ పండుగ మీ జీవితంలో సుఖశాంతులను, అపారమైన అల్లాహ్ దీవెనలను నింపాలని మనసారా కోరుకుంటున్నాను.పట్టణంలో హిందూ ముస్లింలందరు సోదరభావంతో మెలుగుతూ ఉండడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా తెలిపారు.

# వంట గ్యాస్ వినియోగదారులు ఆందోళన చెందవద్దు

**మొదటిపేజీ తరువాయి....**

అనవసరంగా గ్యాస్ బుక్ చేయవద్దన్నారు. ఆన్లైన్లో బుక్ చేసుకోవాలని, ఓటీపీ ద్వారా డెలివరీ చేయడం జరుగుతుందన్నారు. ఏజెన్సీల వద్దకు వెళ్లి బుక్ చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు., ఎవరు ఏజెన్సీల వద్దకు వెళ్ళకూడదన్నారు. ఇంటి వద్దనే గ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీ చేయడం జరుగుతుందని తెలిపారు. అవసరమైన స్టాక్ అందుబాటులో ఉందని కనుక ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మైకుల ద్వారా చెత్త సేకరణకు వచ్చే వాహనాల్లో ప్రచారం చేయించాలని ఆదేశించారు.ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్, డిపిఓలతో మాట్లాడి గ్యాస్ అందుబాటులో ఉందని,ఎవరూ ఆందోళన చెందవద్దని విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా తహసీల్దారులు తమ తమ మండలాల్లో గ్యాస్ ఏజెన్సీలను తనిఖీ చేయాలని తాను ఆదేశించడం జరిగిందన్నారు. ఆయా మండలాల్లో క్షేత్రస్థాయిలో తహసీల్దార్లు తనిఖీలు చేయడం జరిగిందన్నారు. ఎక్కడా వంట గ్యాస్ బ్లాక్ మార్కెటింగ్ కు వెళ్లకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. వీఆర్వోలు జిల్లాలో ఉన్న 50 ఏజెన్సీలలో అందుబాటులో ఉండాలని, గ్యాస్ సరఫరాను మానిటరింగ్ చేయాలన్నారు.




**పవన్ గ్యాస్ ఏజెన్సీ తనిఖీ:** జిల్లా కలెక్టర్ ఆనంద్ నగరంలోని ఏపిహెచ్బి కాలనీలోని పవన్ గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపెనింగ్ బ్యాలెన్స్ ఎంత ఉంది, యావరేజ్ సేల్స్ ఎలా ఉంది, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆన్లైన్లో జరిగిన గ్యాస్ బుకింగ్ ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డిఎస్ఓ వెంకటేశ్వర్లు, సిఎస్డిటి సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగాల కల్పన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

**మొదటిపేజీ తరువాయి....**

చేపడుతోందన్నారు. అభ్యర్థులకు ఎటువంటి గందరగోళం లేకుండా మంత్రి నారా లోకేష్ చర్యలు తీసుకుంటున్నారన్నారు. గత ఐదేళ్ల జగన్మోహన్ రెడ్డి పాలనలో కనీసం ఒక్క ఉద్యోగమైన ఇచ్చారా అని ఆమె ప్రశ్నించారు. అసలు ఆయన పాలనలో రాష్ట్రానికి పరిశ్రమలు రావాలంటేనే భయపడే పరిస్థితి ఉండేదన్నారు. గత టిడిపి ప్రభుత్వం లో రాప్తాడుకు జాకీ పరిశ్రమను తీసుకొస్తే ఆ తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వంలో కమీషన్ల కోసం ఆ సంస్థను వెళ్లగొట్టారన్నారు. తిరిగి తమ కూటమి ప్రభుత్వం వచ్చాక అదే స్థానంలో రేమాండ్స్ సంస్థను తీసుకొచ్చామన్నారు. ఎన్నికలకు ముందు 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ అన్న జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక నిరుద్యోగుల్ని నిలువునా మోసం చేశారన్నారు. జగన్ పాలనలో రైతుల ఆత్మహత్యలే కాక నిరుద్యోగుల ఆత్మహత్యలు కూడా చూశామన్నారు.



ప్రస్తుతం రాష్ట్రంలో యువతకు ఒక నమ్మకం ఏర్పడిందన్నారు. చదువుకున్న ప్రతి ఒక్కరికి ఉద్యోగ ఉపాధి అవకాశాలుంటాయన్న భరోసాను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ లు కల్పిస్తున్నారని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు.

## రంజాన్ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రత్యేక చొరవ

**మొదటిపేజీ తరువాయి....**

మైదానాన్ని పరిశీలించారు.మూడు రోజుల క్రితం వర్షం కురిసిన నేపథ్యంలో మైదానాన్ని పూర్తిగా శుభ్రం చేయించారు. చెత్తా చెదారం ఎక్కడా కనిపించకుండా చేయాలన్నారు. అలాగే తాగునీరు, షామియానాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ముస్లిం సోదరులు ఈద్గాకు వచ్చే మార్గంలో ట్రాఫిక్ లేకుండా చూడాలని సూచించారు. వాహనాల పార్కింగ్ తో పాటు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. నెల రోజుల పాటు ఎంతో కఠోర ఉపావాస దీక్షలు చేస్తూ నియమ నిష్టలతో ఉన్నారన్నారు. వారికి ఈ రంజాన్ పండుగ అన్ని శుభాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రార్థనలకు వచ్చే వారికి ఈద్గా మైదానంలో తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ఎండ వేడిమి దృష్ట్యా వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాలార్ భాష, మాజీ గ్రంథాలయ చైర్మన్ జిరాయత్ గౌస్ మోద్దిన్, ముత్తవల్లి సంఘం అధ్యక్షుడు షకిల్ షఫీ, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సైపుద్దీన్, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, టిడిపి నాయకులు జనబలం బాబా, కట్టుబడి బాబాజీ, ఎస్ఎం భాషా, పూల భాష, షేక్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## దాసరపల్లి కి ఎర్ర బస్సు సౌకర్యం కల్పించండి : గ్రామస్తుల ఆవేదన

**గుడిబండ మార్చి 20 మనం న్యూస్:** సత్య సాయి జిల్లా మడకశిర తాలూకా గుడిబండ మండలం కరికర పంచాయతీ దాసరిపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాసరిపల్లి గ్రామం కర్ణాటక ప్రాంతానికి కిలోమీటర్ దూరంలో ఉండడంతో ఆ గ్రామం అన్ని విధాల ఇబ్బందులు పడుతోంది. కనీసం గుడిబండ మండల కేంద్రానికి వెళ్లాలన్న ద్విచక్ర వాహనాలతోనే వెళ్లాల్సి వస్తోంది. ఆ వాహనాలు లేని వారి పరిస్థితి ధమనీయం, అత్యవసర పరిస్థితుల్లో మండల కేంద్రానికి గాని నియోజకవర్గ కేంద్రానికి గాని వెళ్లాలన్న ఇబ్బందులు పడాల్సిందే.ఎన్ని ప్రభుత్వాలు మారిన ప్రజాప్రతినిధులు మారిన దాసరపల్లికి ఎర్ర బస్సులు నడిపిన పాపాన పోలేదు. ఇక విద్యార్థులు ఇతర ప్రాంతాల పాఠశాలలకు వెళ్లాలన్న తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాల్లో తీసుకొని వెళ్లాల్సిందే. గ్రామస్తులు ఏ పనికి వెళ్లాలన్న ఐదు కిలోమీటర్లు నాగేపల్లి కి గాని 5 కిలోమీటర్లు హిరేతుర్పికి చేరుకుంటే అక్కడి నుండి వారి ప్రయాణం, లేదంటే దాసరపల్లి గ్రామంలోనే ఉండాల్సిన పరిస్థితి ఆనాటి కాలంలో దాసరపల్లి గ్రామ ప్రజలు ప్రయాణానికి ఎన్ని బాధలు పడ్డారో కానీ ఈనాటి కంప్యూటర్ కాలంలో కూడా ఆ గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ గ్రామం మండల కేంద్రానికి దూరంగా ఉండటంతో ప్రభుత్వ అధికారులు, కానీ అక్కడి పాఠశాలలకు వెళ్లే ఉపాధ్యాయులు కానీ ఆ గ్రామానికి రావడానికి వెనుకడుగు వేస్తున్నారు. ఆ గ్రామంలో ఏ సమస్య ఉన్న అధికారులకు చెప్పుకోవడానికి మండల కేంద్రానికి వెళ్లాలన్న ఒకరోజు సమయం పడుతుంది. ఇక మహిళలు అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు వెళ్లాలన్న బాడుగ ఆటోలను రప్పించి తీసుకొని వెళ్లాల్సిందే అవి కూడా అందుబాటులో ఉండవు ఈ విధంగా ఆ గ్రామం ఎన్నో సమస్యలతో ఉన్న ఆ గ్రామానికి ఒక ఎర్ర బస్సులు నడిపితే ఆ గ్రామంతో పాటు మూడు గ్రామాలైన కరికెర, హిరేతుర్పి, గొల్ల హట్టి గ్రామాలకు కూడా బస్సు సౌకర్యం కల్పించినట్లు అవుతుందని దాసరిపల్లి గ్రామస్తులు కోరుతున్నారు. యువకులు జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలైన బెంగళూరుకు వలసలు వెళుతుంటారు. వారు వచ్చి పోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు ఉగాది పండుగ కు బెంగళూరు నుండి దాసరపల్లి గ్రామానికి రావాలన్న తీవ్ర ఇబ్బందులు పడి ఆ గ్రామానికి చేరుకుంటామని యువకులు నాగభూషణ్, జయన్న, శివన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కానీ ప్రజాప్రతినిధులు కానీ ఇప్పటికైనా స్పందించి ఆ గ్రామానికి ఎర్ర బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి



**నార్పల మార్చి 20 మనం న్యూస్ :** అకాల వర్షాలకు పంటలు కోల్పోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంభూపాల్, జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రోజున నార్పల మండలంలోని కేసేపల్లి గ్రామంలో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాలకు పంటలు కోల్పోయిన రైతులకు ఎకరాకు 40 వేల సాయం ఇవ్వాలని వారు కోరారు. కార్యక్రమంలో నడిమి దొడ్డి ప్రభాకర్, ఎర్నాగప్ప, రామాంజనేయులు పాల్గొన్నారు.

## అకాలవర్షాలకు పంట నష్ట పోయిన రైతులను ఆదుకోండి



**కూడేరుమార్చి26(మనం న్యూస్):** ఉరవకొండ నియోజకవర్గం కూడేరు మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో రైతులు పండించిన పలు రకాల పంటలు ఇటీవల కురిసిన.అకాల వర్షాలుకు అరటి, మామిడి మొక్కజొన్న తదితర.పంటలు నేల కొరిగి పంటలు పూర్తి గా నీలమట్టమై తీవ్ర నష్టపోయారని, వెంటనేఆరైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ.రైతు సంఘము నాయకులు డిమాండ్ చేశారు.శుక్రవారం ముద్దలాపురం.గ్రామంలోని పంట దెబ్బ తిన్న రైతులు.అశోక్.రెండున్నర ఎకరాలులో,దాదాపు ఐదు లక్షలుపెట్టు బడి పెట్టాడని,. దేవేంద్ర ఏడున్నర ఎకరాలు లో తొమ్మిది లక్షలు పెట్టుబడి రమేష్ మూడున్నర ఎకరాలు లోఆరు లక్షలుపెట్టు బడి పెట్టి పంటలు సాగు చేశారని పంట నష్టవివరాలు సేకరించారు. ఈసందర్భంగా సిపిఐ రైతు సంఘము నాయకులు మాట్లాడుతూ రైతులు లక్ష లాది రూపాయలు పెట్టు బడి పెట్టి పంటలు సాగు చేస్తే. తీరా పంట కోత సమయానికి వచ్చే సమయంలో అకాల వర్షం కుపంట మొత్తం నీలమట్టమై రైతు ఆశ నిరాశ నీరు కారిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రైతులకు నష్ట పరి హారం ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్చేశారు.ఈకార్యక్రమంలో సిపిఐ మండల. కార్యదర్శి నాగేంద్ర రైతు సంఘము మండల కార్యదర్శి రమణ సిపిఐ సహాయకార్యదర్శులు మలరాయుడు, వెంకటేశులు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఖాసింపీర, సంజీవ పురం వెంకటేష్, నారాయణస్వామి పాల్గొన్నారు.

## పంటల్ని పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారులు



**నార్పల మార్చి 20 మనం న్యూస్:** అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం రోజు పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవి, శాస్త్రవేత్త విజయ శేఖర్ బాబు, నార్పల మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్న వీరస్వామి పాల్గొన్నారు. వరి 25 హెక్టార్లు, మొక్కజొన్న 100 హెక్టార్లలో దెబ్బతిన్నట్టు ప్రాథమిక అంచనాగా తెలిపారు.

## ఆకట్టుకున్న చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు



**ధర్మవరం. మార్చి 20 మనంన్యూస్ :** పట్టణంలోని కొత్తపేట శ్రీ దత్త వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఉగాది పండుగ సందర్భంగా గురువారం రాత్రి శ్రీ లలితా నాట్య కళానికేతన్ చిన్నారులు కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. శ్రీ లలిత నాట్యకళానికేతన్ నృత్య గురువులు బాబు బాలాజీ,కమలా బాలాజీ, రామా లాలిత్య వారి శిష్య బృందం 20 మంది కూచిపూడి, భరత నాట్య ప్రదర్శనలు ఇచ్చారు.వీరిలో పదిమంది చిన్నారులు ప్రప్రథమంగా నాట్య ప్రదర్శనలతో రంగ ప్రవేశం చేసారు. అన్నమయ్య, త్యాగయ్య, పురందరదాసు, రామదాసు కీర్తనలకు చిన్నారుల నాట్య ప్రదర్శనలు అందరిని అబ్బు రపరిచాయి. ఇటువంటి నాట్య ప్రదర్శనను తిలకించిన దేవాలయ కమిటీ వారు వారిని అభి నందించి చిన్నారులకు మెడల్స్ ప్రధానం చేశారు.నాట్య గురువులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాట్య గురువులు బాబు బాలాజీ, కమలా బాలాజీలు మాట్లాడుతూ ఇటువంటి అవకాశం కల్పించిన ఆలయ కమిటీ వారికి కృతజ్ఞతలు తెలియ జేశారు.







## అట్టహాసంగా ఇఫ్తార్ విందు

**హిందూపురం (మనం న్యూస్) మార్చి 20:** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిసేవాస్ఫూర్తితో రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకొనిఆఖరి రోజు శుక్రవారంవైసీపీ యువనేత జుబేర్ కుటుంబ సభ్యుల సౌజన్యంతో హిందూపురం పట్టణంలోని విద్యానగర్ సమీపంలోఉన్న పతామసీద్ వద్ద ఏర్పాటుచేసిన రంజాన్ఉపవాసముస్లింలఇఫ్తార్ విందుకార్యక్రమం అట్టహాసంగా సాగింది. ఈ సందర్భంగామసీద్ ముత్తవల్లిల సమక్షంలో వందలాది మంది ముస్లిం సోదరులు దైవ ప్రార్థనలుచేసివైసీపీ యువనేత జుబేర్ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలోపాల్గొన్నారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశయానికి అనుగుణంగా కులమతాలకుఅతీతంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు.సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి తమ వంతు సహకరిస్తామని వైసిపి యువనేత జుబేర్ తెలిపారు.ప్రతి ఏడాది కార్తీక్ మాసంలోబెంగళూరు రోడ్డులో వెలసిన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలోప్రత్యేక పూజలు నిర్వహించి మాల ధరించిన అయ్యప్ప భక్తాదులకుఅన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తుంటామని తెలిపారు.ఇదే విధంగా రంజాన్ మాసంలో ఓ రోజు ముస్లింసోదరులకు ఇఫ్తార్ విందుఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.గత కొన్ని సంవత్సరాలుగా తాము సంపాదించిన సంపాదనలో అంతోఇంతోసమాజాభివృద్ధికి తోడ్పాటు అందిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నామని జుబేర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మాజీ సమన్వయకర్త వేణుగోపాల్ రెడ్డి మసీద్ ముతవల్లి హాజీ అబ్దుల్ సుభాన్ సాబ్ మస్తాన్ వలీ.వివిధ ప్రాంతాల ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## ఉప్పొంగిన అభిమానం...

**- అట్టహాసంగా యువనేత తొండపునాటి రమేష్ రాయల్ జన్మదిన వేడుకలు**
**- రమేష్ యువసేన ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు..**
**- పలుచోట్ల అన్నదానాలు.. 500 మందికి చీరలు పంపిణీ.. 200 మంది రక్తదానం.. భారీ కేక్ కటింగ్**



**అనంతపురం, మార్చి 20 మనంన్యూస్ :** తెలుగుదేశం పార్టీ యువ నాయకులు, రాయలసీమ బలిజ మహా సంఘం యువజన జిల్లా అధ్యక్షులు తొండపు నాటి రమేష్ రాయల్ జన్మదిన వేడుకలు అట్టహాసంగా జరిగాయి. అయితే.. ఇటీవల రమేష్ రాయల్ మాతృమూర్తి శివైక్యం గావించడంతో రమేష్ తన జన్మదిన వేడుకలకు



దూరంగా ఉన్నారు. కాగా.. తొండపు నాటి రమేష్ అభిమానులు తమ అభిమాన నాయకుడు జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాల ద్వారా ఘనంగా నిర్వహించాలని సంకల్పించారు. సేవా తత్పరుడు.. ఎవరికి కష్టమొచ్చిన ముందుండే నాయకత్వ లక్షణం.. సామాజిక బాధ్యత కలిగిన తొండపునాటి రమేష్ రాయల్ పై అభిమానాన్ని చాటుకుంటూ రమేష్ యువసేన, పలువురు బలిజ యువత ఆధ్వర్యంలో నగరవ్యాప్తంగా సేవ సామాజిక కార్యక్రమాలను నిర్వహించారు. అందులో భాగంగా అనంతపురం సర్వజన ఆస్పత్రి, పాతూరు ఆసుపత్రి తో పాటు పలు ప్రాంతాల్లో భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మున్నా నగర్ లో రమేష్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 200 మంది రమేష్ పై తమ అభిమానాన్ని చాటుతూ సామాజిక బాధ్యతగా రక్తదానం చేయడం విశేషం. 500 మంది మహిళలకు నాణ్యత గల చీరలను పంపిణీ చేశారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. హ్యాపీ బర్త్ డే రమేష్ నినాదాలతో హోరెత్తించారు.

## మండల గ్యాస్ వినియోగదారులకు విజ్ఞప్తి

**-ముందుగా 7710955555 నంబరుకు మిసుడ్కాల్ చేస్తే బుక్ అగును**
**-ఏమైన ఇబ్బందులు తలెత్తుతే 8341995329 కాల్ చేయండి**




**కుందుర్పి, మార్చి 20, మనంన్యూస్ :** గ్యాస్ వినియోగదారులకు గ్యాస్ అవసరమైనా వాళ్ళు ముందుగా గ్యాస్ సిలిండర్ను చరవాణి 77 10 95 55 55 నంబర్కు మిస్డ్ కాల్ చేస్తే ,మీ సిలిండర్ బుక్ అవుతుందని కుందుర్పి మండల సహస్ర భారత్ గ్యాస్ గ్రామీణ వితర ఏజెన్సీ నిర్వాకరాలు, ఎస్, మంజుల శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ. 7718012345 నంబర్ కు ఫోన్ చేసి బుకింగ్ చేసుకొనవలెనని కోరారు. తర్వాత మీకు మా డెలివరీ బాయ్స్ ఫోన్ చేసి గ్యాస్ డెలివరీ కోడ్ మా డెలివరీ బాయ్స్ కి చెప్పి తర్వాతనే మీకు సిలిండర్ మీ ఊరిలోనే ఇంటి దగ్గరికి ఇవ్వడం జరుగుతుందని వివరించారు. కావున ఎవరు కూడా గ్యాస్ కార్యాలయం దగ్గరకు కానీ ,గ్యాస్ గోడౌన్ దగ్గర కానీ, ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదుని పేర్కొన్నారు. స్థానిక కార్యాలయం దగ్గర కాని, గోడౌన్ దగ్గర కాని ఎప్పుడు కూడా గోడౌన్ డెలివరీ ఇవ్వము అని సూచించారు. వినియెగథారులైన మీరు గ్యాస్ కోసం తప్పకుండా బుక్ చేసుకోవాలిని చెప్పారు. అదేవిధంగా మా డెలివరీ బాయ్స్ వచ్చినప్పుడు డెలివరీ కోడ్ మీ ఫోన్లో వచ్చిన దానిని కచ్చితంగా చెప్పితేనే మికు గ్యాస్ సిలిండర్ ను ఇస్తారు అని తెలిపారు. అదేవిధంగా కుందుర్పి పట్టణ ప్రజలకు కూడా తెలియజేయడం ఏమనగా ఎవరైతే మధ్యాహ్నం ఒంటిగంట లోపల సిలిండర్ బుక్ చేసుకుని ఉంటారో అలాంటి వారికి వారి ఇంటి దగ్గరికి ప్రతిరోజు నాలుగు గంటల సమయంలో డెలివరీ చేస్తాము అని తెలియజేశారు, ఒంటి గంట తర్వాత బుక్ చేసుకున్న కుందుర్పి ప్రజలకు మరుసటి రోజు సాయంత్రం నాలుగు గంటల తర్వాతనే డెలివరీ చేయబడునుఅని పేర్కొన్నారు .ఈ విషయాన్ని వినియోగదారులు అందరూ తెలుసుకొని ఏజెన్సీ నిర్వాకరాలుకు సహకరించవలసిందిగా తమను మరీ మరీ కోరారు. ఏమైనా ఇబ్బంది ఉంటే ఈ క్రింది నెంబర్ కు 834199 5329 ఫోన్ చేసి మాట్లాడి మీ సమస్యను పరిష్కారం చేసుకోండని పిలుపునిచ్చారు. మరొక్కసారి గ్యాస్ వినియోగదారులకు తెలియజేయడమైనగా దయచేసి గ్యాస్ కార్యాలయం దగ్గర కాని ,గ్యాస్ గోడౌన్ దగ్గరకు కాని సిలిండర్ కోసం రావద్దండని విజ్ఞప్తి చేశారు.

# హిందూపురం మున్సిపాలిటీకి ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ బాధ్యతలు స్వీకరణ




**హిందూపురం (మనం న్యూస్) మార్చి 20:** శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ ఎ. శ్యామ్ ప్రసాద్ శుక్రవారం మున్సిపాలిటీకి ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జి.ఓ.ఆర్.టి. మరియు జి.ఓ.ఆర్.టి. నం. 339 ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు మరియు మున్సిపాలిటీలలో ఎన్నికైన ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగియడం మరియు కొత్త ఎన్నికలు జరిగే వరకు పరిపాలనను సక్రమంగా కొనసాగించేందుకు ప్రత్యేక అధికారులను నియమించడం జరిగింది. ఈ క్రమంలో హిందూపురం మున్సిపాలిటీకి ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ ని నియమించారు.ఈ రిశుధ్య నిర్వహణ,పట్టణంలో రోజువారీ చెత్త సేకరణ, డంపింగ్ యార్డుల నిర్వహణ, శుభ్రతపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించడం,తాగునీటి సరఫరా,ప్రతి వార్డుకు సమయానికి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవడం, లీకేజీలు మరియు సరఫరా లోపాలను వెంటనే పరిష్కరించడం,డ్రైనేజీ -- కాలువలు మురుగునీటి కాలువల శుభ్రపరిచే పనులు వేగవంతం చేసి నీరు నిల్వ సమస్యలను నివారించడం రోడ్లు --మౌలిక వసతులు చెడిపోయిన రోడ్ల మరమ్మతులు, స్ట్రీట్‌లైట్స్ నిర్వహణ, అవసరమైన చోట్ల కొత్త వసతుల ఏర్పాట్లు పన్నుల వసూళ్లు ఆస్తి పన్ను, నీటి పన్ను వసూళ్లను సమర్థవంతంగా నిర్వహించి, మున్సిపాలిటీ ఆర్థిక స్థితిని మెరుగుపరచడం ప్రజా ఫిర్యాదుల పరిష్కారం ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి, ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం అనధికార నిర్మాణాల నియంత్రణ అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుని, పట్టణ ప్రణాళికను కాపాడడం పచ్చదనం – పార్కులు పట్టణంలో చెట్ల నాటడం, పార్కుల అభివృద్ధి ద్వారా పర్యావరణ పరిరక్షణకు చర్యలు డిజిటల్ సేవలు ఆన్‌లైన్ సేవలను బలోపేతం చేసి, ప్రజలకు సులభంగా సేవలు అందేలా చేయడం అన్ని విభాగాల అధికారులతో సమన్వయం సాధించి, అభివృద్ధి పనులను వేగవంతం చేయడం సందర్భంగా కలెక్టర్ మున్సిపాలిటీ పరిధిలో చర్యలు చేపట్టనున్నట్లు ప్రాధాన్య చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ ఆర్డీవో ఆనంద్‌కుమార్, ,హిందూపురం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# గ్యాస్ కోసం బారులు తీరిన ప్రజలు...

**నో స్టాక్ బోర్డు పెట్టిన సిబ్బంది.. గ్యాస్ కష్టాలు తీర్చాలంటూ ప్రజలు విజ్ఞప్తి**

**రాయదుర్గం మార్చి 20 మనం న్యూస్:** పట్టణంలో కనేకల్ రోడ్ లో ఉన్న హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీస్ ఎదుట గ్యాస్ కొరకు జనాలు బార్లు తీరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15 రోజుల ముందే బుక్ చేసిన గ్యాస్ రాలేదని ప్రజలు వాపోయారు. పట్టణం వారే కాకుండా గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున జనాలు క్యూ కట్టారు. అవుట్ ఆఫ్ స్టాక్ బోర్డు పెట్టడంతో జనాలు రోడ్డెక్కారు.కావున సంబంధిత అధికారులు స్పందించి గ్యాస్ కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుచున్నారు.



# మద్యం తాగి వాహనం నడిపిన లారీ డ్రైవర్‌కు రూ.10 వేల జరిమానా

**హిందూపురం (మనం న్యూస్) మార్చి 20:** జిల్లాలో రోడ్డు భద్రతను కట్టుదిట్టం చేయడం లక్ష్యంగా జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాలతో, డీఎస్పీ కేవీ మహేష్ నేతృత్వంలో పోలీసులు చేపడుతున్న వాహన తనిఖీలలో భాగంగా, బుధవారం కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద జాతీయ రహదారిపై హిందూపురం రూరల్ సీఐ కె. జనార్ధన్, ఎస్సై మునీర్ అహ్మద్ సిబ్బందితో కలిసి ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల సందర్భంగా హిందూపురం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కే. జనార్దన్, చిలమత్తూరు ఎస్సై మునీర్ అహ్మద్ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీల సమయంలో ఒక లారీ డ్రైవర్‌పై అనుమానం కలగడంతో, డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష నిర్వహించగా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అజిత్ పాల్ అనే వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు నిర్ధారణ అయింది. అనంతరం అతనిని అదుపులోకి తీసుకుని, హిందూపురం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ కేసును విచారించి రూ.10,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా సిఐ కె.జనార్ధన్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడపడం ప్రాణాపా యం కలిగించే చర్య అని, ఇలాంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, సురక్షిత ప్రయాణం చేయాలని సిఐ సూచించారు.
36



# డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్ కు వాడితే క్రిమినల్ కేసులు నమోదు



**హిందూపురం (మనం న్యూస్) మార్చి 20.** హిందూపురం పట్టణం నందు యధాచ్చే దంగా ఇంటిలో ఉపయోగించే డొమెస్టిక్ సిలిండర్లను హోటళ్ళు, రెస్టారెంట్లు నందు వినియోగిస్తున్నారన్న విషయమై శుక్రవారం హిందూపురం పట్టణం నందు గల హోటళ్ళు, రెస్టారెంట్ల లలో రెవెన్యూ అధికారులు తనకీలు నిర్వహించారు. తహసిల్దార్ వెంకటేష్ ఆదేశాల మేరకు స్థానిక సివిల్ సప్లై డిప్యూటి తహసిల్దార్ హారతి మరియు రెవెన్యు అధికారులు విస్తృతంగా తనఖీలు నిర్వహించగా హోటళు ్ళ, రెస్టారెంట్లు నందు కమర్షియల్ సిలిండర్లను మాత్రమే ఉపయోగిస్తున్నారు. మరియు ఎవరైనా డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్ కు వాడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తామని హెచ్చరించడం జరిగినదని తెలియచేయడమైనదని తాహసిల్దార్ పేర్కొన్నారు.

# ట్యాంకరుచే తాగునీటి దాహార్తి తీర్చుతున్న సర్పంచ్



**కుందుర్పి, మార్చి 20, మనం న్యూస్ :** మండల పరిధిలోని అపిలేపల్లి గ్రామంలో గత వారం రోజుల పాటు ఎస్సీ అంబేద్కర్ కాలనీ, బీసీ వడ్డే కాలనీ, ముస్లిం కాలనీలలులో తాగునీటి ఎద్దడిని ఆ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలోనే అపిలే పల్లి గ్రామ సర్పంచ్ హసీనాబీ అతావుల్లా వెంటనే స్పందించినారు. ఉగాది పర్వదినం సందర్భంగా మానవదృక్పథంతో గత రెండు రోజులుగా పై తెలిపిన మూడు కాలనీలలో వాటర్ ట్యాంక్ ద్వారా ఆ కాలనీ ప్రజలకు నీటి దాహార్తిని సరఫరా చేసి తీర్చారు. ఆ గ్రామంలో నీటి ఎద్దడితో తల్లిడేల్లిపోతున్న ఆమూడు కాలనీ ప్రజలకు నీటి దాహార్తి తీర్చడం పట్ల ఆ సర్పంచ్ను వారు హర్షించి అభినందించారు.

# ఈద్గాలో 55 లక్షల రూపాయలతో సీసీరోడ్ల ఐమాక్స్ లైట్ల ఏర్పాటు

**– దీర్ఘకాలిక సమస్య పరిష్కారంపై హర్షం వ్యక్తం చేసిన మైనార్టీలు**
**–ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ని ఘనంగా సత్కరించిన ముస్లిం మత పెద్దలు**

**కదిరి, మార్చి20(మనం న్యూస్):** కదిరిలో ఈద్గా ఖబరస్తాన్ లో దీర్ఘకాలిక సమస్యలను ఇచ్చిన మాటకు కట్టుబడి కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పరిష్కరించారు. 55 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం ఐమాక్స్ లైట్లు ముస్లిం మత పెద్దలతో కలిసి శు క్రవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. దీర్ఘకాలిక సమస్య పరిష్కారం కావడం పట్ల ముస్లిం మత పెద్దలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ:– ఈద్గా లో నెలకొన్న సమస్యలను పరిష్కరించామని, గతంలో నిర్మించిన షాదీ మహల్ ను పూర్తిగా అందుబాటులోకి తీసుకొచ్చే బాధ్యత తీసుకుంటా న్నారు. 2 నెలల్లో షాది మహల్ ను పూర్తి చేస్తానని ముస్లింలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ముస్లిం పేద ప్రజలకు సౌకర్యంగా ఉండే విధంగా చర్యలు చేపడతామన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.





# కేవలం 10 వేల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ ప్రకటించడం.. యువతను మోసం చేయడమే

**ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్ కుమార్.**

**అనంతపురం. మార్చి 20 మనం న్యూస్ ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన "జాబ్ క్యాలెండర్"లో కేవలం 10 వేల ప్రభుత్వ ఉద్యోగాలను మాత్రమే చూపించడం యువతను మభ్యపెట్టే మరో ప్రయత్నమని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు జి. సంతోష్ కుమార్ తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో లక్షల సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలు ఉన్నాయన్నారు.వాటిని భర్తీ చేయకుండా కేవలం తక్కువ సంఖ్యలో పోస్టులను ప్రకటించడం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధమైన ప్రకటనలు నిరుద్యోగ యువతలో నిరాశను పెంచడమే తప్ప, సమస్యకు ఎలాంటి శాశ్వత పరిష్కారం కాదని అన్నారు. యువతకు న్యాయం చేయాలంటే ఖాళీలను పూర్తి స్థాయిలో గుర్తించి, సమగ్ర నియామక ప్రణాళికతో పెద్ద ఎత్తున ఉద్యోగాలు భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఇకపై నిరుద్యోగ సమస్యపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోకపోతే, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని సంతోష్ కుమార్ హెచ్చరించారు.

# కాల వర్షాలు అపార నష్టం

**వడగండ్ల వర్షంతో నేలకొరిగిన అరటి, బొప్పాయి, మొక్కజొన్న**
**–పరిహారం అందించాలని రైతులు ప్రభుత్వానికి వేడుకోలు**



**బత్తలపల్లి, మార్చి 20 మనం న్యూస్:** కారుగాలం శ్రమించి సాగుచేసిన పంటలు చేతికొచ్చిన సమయంలో అకాల వర్షాలతో పూర్తిగా పంటలు దెబ్బతిన్నట్లు రైతులు వాపోయారు. గత రాత్రి వీచిన అకాల వడగండ్ల వర్షానికి మండలం పరిధిలోని గంటాపురం గ్రామానికి చెందిన జాస్తి నాగరాజు, జాస్తి నిర్మలమ్మ పొలాలలో సాగుచేసిన అరటిపంట పూర్తిగా దెబ్బతిన్నట్లు బాధ్యత రైతులు పేర్కొన్నారు. కట్టకిందపల్లికి చెందిన బత్తినేని విశ్వనాధ్ అరటి పంట,బత్తినేని చంద్రశేఖర్ పొలాలలో మొక్కజొన్న, తరిగోపుల నారాయణస్వామి, జయచంద్ర అరటి పంట బత్తాయి చెట్లు, 48 పలికి చెందిన బొమ్మ గంగమ్మ పొలంలో 6వేలు అరటి మొక్కలు అదే గ్రామానికి చెందిన మధుసూదన్ రెడ్డి పొలంలో మామిడి, టమోటా పంటలు పూర్తిగా దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. అలాగే కాటమకుంట, ముద్దనపల్లి డి.చెర్లోపల్లి గ్రామాలలో రైతులు పూర్తిగా నష్టపోయిన. మండలంలో కురిసిన అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయ అధికారి కృష్ణయ్య, జిల్లా వ్యవసాయ సలహా, సాంకేతిక కేంద్రం శాస్త్రవేత్త రామసుబ్బయ్య, పరిశీలించారు. మండలంలోని వివిధ గ్రామాలలో రైతులు సాగు చేసిన పంటలు అకాల వర్షాల వల్ల ఎంత మేరకు నష్టపోయాయో సమగ్ర నివేదికను పంపాలని క్రింది స్థాయి సిబ్బందికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అలాగే అర్హులైన రైతులకు ప్రభుత్వం ద్వారా అందుబాటులో ఉన్న పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పరిశీలన కార్యక్రమంలో తహసిల్దార్ స్వర్ణలత, మండల వ్యవసాయ అధికారి ఓబిరెడ్డి , విస్తరణ అధికారి శ్రీనివాస్ , గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్ రెడ్డి, రవి, బాలరాజు నాయక్ గారు, సోమశేఖర్, టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ సురేంద్ర నాయుడు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అయ్యప్ప, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు , సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, సింగల్ విండో డైరెక్టర్ రవి, చంద్రశేఖర నాయుడు , పురుషోత్తం రెడ్డి , రామాపురం కేశవ , ఉమ్మాల చంద్రశేఖర్ , చౌదరి , ఆంజనేయులు , నారాయణస్వామి , లక్ష్మీనారాయణ రైతులు పాల్గొన్నారు.

# వార్డుల్లో తిరగండి ... ప్రజల మనసులు గెలవండి





## - టీడీపీ కార్యకర్తలకు ఎమ్మెల్యే కాలవ దిశా నిర్దేశం

**రాయదుర్గం మార్చి 20 మనం న్యూస్:** బద్ధకం మంచిది కాదని, కష్టపడితేనే భవిష్యత్తులో రాణించగలుగుతారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పార్టీ శ్రేణులకు హితోపదేశం చేశారు. వార్డుల్లో తిరుగుతూ ప్రజల మనసులు గెలవడానికి శ్రమించాలన్నారు. ఈ మేరకు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం తాజామాజీ కౌన్సిలర్లు ప్రశాంతి, జ్యోతిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ, అధికార పక్షంలో పని చేస్తున్నప్పుడు ఎవరి హోదాకు తగ్గ స్థాయిలో వారికి ఒత్తిళ్లు తప్పక ఉంటాయని గుర్తు చేశారు. మనస్థాయికి తగ్గ ఇబ్బందులు మనకు ఉంటే, ముఖ్యమంత్రి స్థాయికి తగ్గ ఇబ్బందులు, ఒత్తిళ్లు ఆయనకు ఉంటాయన్నారు. మరోవైపు ప్రభుత్వం చేయాలనుకున్న పనులను వైకాపా దుష్ట శక్తులు అనునిత్యం అడ్డుకునే ప్రయత్నం చేస్తూనే ఉంటాయన్నారు. ఆర్థిక ఇబ్బందులతో పాటు ప్రత్యర్థుల సవాళ్లను, అవరోధాలను అధిగమిస్తూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చేయాలనుకున్న మంచి పనులు చేస్తూ... చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తోందన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఏ ఏ రంగాల్లో ఎలాంటి అవసరాలు ఉన్నాయో గుర్తించి వాటి పరిష్కారానికి తాను ఏ విధంగా అయితే చర్యలు తీసుకుంటున్నానో.. మీమీ వార్డుల పరిధిలో మీరు కలిసికట్టుగా పని చేయాలన్నారు. కనీసం వారానికి మూడు, నాలుగు రోజులైనా రోజుకు రెండు గంటల పాటు వార్డుల్లో తిరగడానికి సమయం కేటాయించాలన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా..? లేదో..? విచారించాలన్నారు. ఎక్కడైనా నిజమైన అర్హులకు అందకపోతే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సంక్షేమ ఫలాలు అందేలా చూడాలన్నారు. రాయదుర్గం పట్టణంలో ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపట్టడం జరుగుతోందన్నారు. ముఖ్యంగా అంతర్గత రహదారులు, సిసి రోడ్లు, మురుగునీటి కాలువలు, మంచినీటి సౌకర్యం, వీధి దీపాల ఏర్పాటు లాంటి అనేక అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. వార్డుల్లో అవసరమైన పనులను గుర్తించి సంబంధిత అధికారుల ద్వారా అభివృద్ధికి దోహదపడాలన్నారు. అప్పుడే ప్రజలతో మంచి సంబంధాలు కొనసాగించటానికి వీలవుతుందన్నారు. స్థానిక సంస్థలకు త్వరలో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో మీ మీ వార్డుల పరిధిలో విస్తృతంగా పర్యటించి ప్రజలతో మెరుగైన సంబంధాలు కొనసాగించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో తప్పక అన్ని స్థానాల్లో విజయం సాధించే విధంగా బలం పుంజుకోవాలన్నారు. అప్పుడే తనతో పాటు అందరికీ ఎలాంటి సమస్య ఉండదని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, మాజీ కౌన్సిలర్లు కురుబ ప్రశాంతి, బళ్లారి జ్యోతి, బండి భారతి, టకీశకాల హనుమంతు, పోరాళ్ల పురుషోత్తం, పసుపులేటి నాగరాజు, పూజారి తిప్పయ్య, సంపత్ కుమారి, ఉమ, సుమలత, వేణు, కరెన్న,భోలె శంకర్, పోరాళ్ల ధనర్జున, ఆనంద్, వై. వెంకటేశులు, గుద్దిటి లోకేష్,ఆటో వెంకటేశులు,ఖలందర్, ఎల్లప్ప, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### జనగణన 2027 శిక్షణ నిర్వహణ కేంద్రాన్ని

# పరిశీలించిన డిఆర్ఓ మాలోల

**అనంతపురం ,మార్చి 20 మనం న్యూస్ ప్రతినిధి:** భారత ప్రభుత్వం చేపట్టనున్న జనగణన 2027 తొలి దశలో భాగంగా నిర్వహించనున్న గృహ జాబితా శిక్షణ కేంద్రాన్ని డిఆర్ఓ మాలోల, జిల్లా సెన్సెస్ అధికారులు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. అనంతపురం ఇన్చార్జ్ ఆర్డీవో రామ్మోహన్ తో కలిసి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల లోని కంప్యూటర్ ల్యాబ్ ను తనిఖీ చేసారు. శిక్షణ తరగతులకు అవసరమైన సదుపాయాల కల్పన గురించి అధికారులకు పలుసూచనలు చేశారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మలోల మాట్లాడుతూ ఈనెల 26 నుండి 29 వ తేదీ వరకు ఆర్ట్స్ కళాశాలలోని కంప్యూటర్ ల్యాబ్ లో ఎంపిక చేసిన క్షేత్ర స్థాయి శిక్షకులు 80 మందిని 3 బ్యాచ్ లు గా విభజించి ప్రత్యేక అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ రెండు దశలలో ఉంటుందన్నారు. ఇందులో మొదటి దశ లో హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సెస్ (హెచ్ ఎల్ ఓ) లేఅవుట్ మ్యాపింగ్ కాగా రెండవ దశలో జనగణన జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో మొదటి దశలో భాగంగా గృహ గణన నమోదు ప్రక్రియ ఎలా జరగాలన్న అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల మంగళగిరిలోని ఏపీ హెచ్ఆర్ డి లో అనంతపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన జంతుశాస్త్ర అధ్యాపకులు జివిఎన్ ప్రసాద్, ఎస్. కిరణ్ రసాయనిక శాస్త్ర అధ్యాపకులను మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ పొందిన నేపథ్యంలో వీరు జిల్లా ప్రధాన కేంద్రంలో జనగణన అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తారన్నారు. ప్రస్తుతం శిక్షణ పొందిన వారు మండల స్థాయిలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు తదితరులకు జనగణన ప్రక్రియ పై అవగాహన కల్పిస్తారన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా శిక్షణ తరగతులు పూర్తిచేయాలని డిఆర్ఓ పలు శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ రాజా, డిప్యూటీ మునిసిపల్ కమిషనర్, ఆర్.ఐ లు తేజ, సందీప్, సెన్సెస్ విభాగం డిప్యూటీ తాసిల్దార్ మధు సూదన్ రావు, ఎస్.ఓ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.



## జ్యోతుల ఉత్సవాల వేల ఎంపీ బీకే పార్థసారధికి డిసి ఈశ్వరయ్య ప్రత్యేక విందు

**- చౌడేశ్వరి ఆలయ అభివృద్ధికి రూ.15 లక్షల నిధులు ప్రకటించిన ఎంపీ బీకే**

**సోమందేపల్లి టౌన్ మార్చి 20 మనంన్యూస్:** ఉగాది పర్వదిన సందర్భంగా మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన శ్రీ చౌడేశ్వరి దేవి పంచమ జ్యోతుల మహోత్సవంలో పాల్గొన్న హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికే పార్థసారథి , ఆయన తనయుడు సాయి కళ్యాణ్, అల్లుడు శశిభూషణ్ కు తన స్వగృహంలో ఆలయ ధర్మకర్త, మాజీ సర్పంచ్ మాస్టర్ వీవర్ డిసి. ఈశ్వరయ్యప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. చౌడేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం వారిని తన ఇంటికి



స్వయానా విందుకు పిలిచి కెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీ బికే పార్థసారథి మాట్లాడుతూ. చౌడేశ్వరి దేవి పంచమ జ్యోతుల మహోత్సవాన్ని ఆలయ కమిటీ వారు కనుల పండుగ నిర్వహించారని, భవిష్యత్తులో మరింత ఉత్సాహంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు తన వంతు సహాయ సహకారం అందిస్తామన్నారు. అదేవిధంగా చౌడేశ్వరి దేవి ఆలయంలో డైనింగ్ టేబుల్ ఏర్పాటుకు రూ 15 లక్షలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ పార్థసారథి తనయుడు అల్లుడు శశి భూషణ్ ను ఈశ్వరయ్య ఘనంగా సత్కరించారు. అదేవిధంగా మాజీ మంత్రి పార్లమెంట్ సభ్యులు నిమ్మల కిష్టప్ప డి సీఈశ్వరయ్య ఆహ్వానం మేరకు చౌడేశ్వరి దేవి పంచమ జ్యోతుల మహోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి తనను ఆహ్వానించిన డిసి ఈశ్వరయ్య, ఆయన తనయుడు లోకేష్ కు ఈ సందర్భంగా మాజీ మంత్రి నిమ్మలకిష్టప్ప కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. పలువురు నాయకులు మాజీలు అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొనడం చర్చనీయాంశమైంది. ముఖ్యంగా మాజీ సర్పంచ్ డీసీ. ఈశ్వరయ్య ఆలయ ధర్మకర్తగా అన్నీ తానే వ్యవహరించి జ్యోతుల ఉత్సవాన్ని భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వహించి భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసి వారి మన్నన పొందారు.



# వైభవంగా శ్రీ చౌడేశ్వరి దేవి పంచమ జ్యోతుల మహోత్సవం

**- పూజల్లో పాల్గొన్న మంత్రి సవితమ్మ ఎంపీ బీకే పార్థసారథి...**

**- అన్ని తానై వ్యవహరించిన ఆలయ ధర్మకర్త డిసి ఈశ్వరయ్య...**

**సోమందేపల్లి టౌన్ మార్చి 20 మనం న్యూస్:** ప్రపంచ మానవాళికి సుఖ సంతోషాలను ప్రసాదించే తొగట వీర క్షత్రియుల ఆరాధ్య దైవం సకల మానవాళికి కొంగుబంగారమై విరాజిల్లు శ్రీ చౌడేశ్వరి దేవి పంచమ జ్యోతుల మహోత్సవం మండల కేంద్రమైన సోమందేపల్లి లో శుక్రవారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా భక్తులకు కనుల పండుగ గా జరిగింది. దశాబ్దాల కాలంగా ఉగాది పర్వదినం సందర్భంగా అమ్మవారికి జ్యోతుల ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. పరాభవ నామ సంవత్సర పర్వదిన సందర్భంగా నేడు జరిగిన పంచమ జ్యోతుల మహోత్సవాన్ని వేలాదిమంది భక్తులు జిల్లా నలుమూలల నుండే కాకుండా పక్క రాష్ట్రాలైన తెలంగాణ కర్ణాటక తమిళనాడు నుంచి పెద్ద ఎత్తున హాజరవుతారు. ఈ ఏడాది పరాభవ నామ సంవత్సరఉగాది వేడుకలను ఆలయ ధర్మకర్త డిసి. ఈశ్వరయ్య ఆధ్వర్యంలో జ్యోతి సంఘం సభ్యులు అద్భుతంగా నిర్వహించారు. మునుపెన్నడు జరగని రీతిలో ఆలయాన్ని పట్టణాన్ని విద్యుద్దీపాల కాంతులతో సుందరంగా తీర్చిదిద్దారు. శుక్రవారం తెల్లవారుజామున రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జోలి శాఖ మాత్యులు సవితమ్మ కూటమి నాయకులు హిందూపురం పార్లమెంటు కార్యవర్గ సభ్యులు నీరు గంటి చంద్రశేఖర్, మండల కన్వీనర్ నడింపల్లి వెంకటేశులు, మాజీ కన్వీనర్ సిద్ది లింగప్ప, రామకృష్ణంతో కలిసి అమ్మవారి ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఊరేగింపు విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పంచమ జ్యోతుల కేళీ ని తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి సవితమును తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షులు సిసిహరి ఘనంగా





సన్మానించారు. ఉత్సవాల్లో భాగంగా పలు వీధులలో మంత్రితో కలిసి వందలాదిమంది మహిళలు, అభిమానులు చిన్నారులు తో కలిసి ఫోటోలో దిగారు. పూజలో భాగంగా రెండో రోజు అమ్మవారికి సహస్ర కలశాభిషేకం కుంకుమార్చన బంగారు ఆభరణాలతో దేదీప్యమానంగా అలంకరించారు. ఈ సందర్భంగా తొగట వీర క్షత్రియులు తయారుచేసిన పంచమ జ్యోతులను తలపై ధరించి భక్తులు లాలి పాటలతో శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటల నుండి గ్రామంలోని గ్రామంలోని పీర్ల చావడి ఆంజనేయ సర్కిల్ పాత బజార్ డిసి వారి వీధి పాత మార్కెట్ ఏరియాల గుండా తలపై జ్యోతులు ధరించి ఆడిన నృత్యాలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. భక్తులను మైమరిపించే రీతిలో జ్యోతి సంఘం సభ్యులు అమ్మవారి సూత్ర పాఠాలకు తాళాలు అనుగుణంగా వేస్తూ ఆలపించడం విశేష ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త డిసి. ఈశ్వరయ్య మాట్లాడుతూ సకల మానవాళి సుభిక్షంగా ఉండాలని భారతదేశం ప్రపంచంలో అత్యంత స్థాయికి ఎదగాలని ప్రజలందరూ బాగుండాలని సకల సౌభాగ్యాలు దేశ ప్రజలకు అందించాలని శ్రీ చౌడేశ్వరి మాతకు పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రీతి పూర్వకంగా వందలాదిగా మేకలు గొర్రెలు, పొట్టేలు కోళ్లు మరేదంగా బలి ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో వేలాదిమంది అమ్మవారి భక్తులు, ముఖ్యంగా మహిళలు యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

**- పాల్గొన్న ముస్లిమ్ సోదరులు, మత పెద్దలు**

**కదిరి, మార్చి20 మనం న్యూస్:** పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా కదిరి పట్టణంలోని మజీద్ ఏ ఔలియా అల్లాహ్ మస్జిద్ కమిటీ వారి ఆహ్వానంతో శుక్రవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ మసీదుకు చేరుకున్నప్పుడు ముస్లిం మత పెద్దలు మరియు సోదరులు ఎంతో ఆత్మీయంగా స్వాగతం పలికారు. వారితో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొని కొంత సమయం గడపిన ఎమ్మెల్యే మత సామరస్యాన్ని పెంపొందిస్తూ అందరం కలిసికట్టుగా ముందుకు సాగాలని కోరుకుంటున్నాను అని తెలియజేశారు. ముస్లిం సోదరులతో కలసి సామూహిక ప్రార్థనలో వారితో కలిసి ప్రార్థనలు చేసిన ఎమ్మెల్యే, మత పెద్దలు.




# ముస్లిం మైనార్టీ ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు

**-ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి**




**పుట్టపర్తి మార్చి 20 మనం న్యూస్:** ముస్లిం మైనార్టీ ప్రజలకు ఎంతో పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి లు నియోజకవర్గంలో రంజాన్ పండుగ జరుపుకుంటున్న సందర్భంగా ముస్లిం ప్రజలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లిం మత పెద్దల సూచన మేరకు నెలవంక దర్శనం అనంతరం ముస్లింలు శనివారం రంజాన్ పండుగ జరుపుకుంటున్న సందర్భంగా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి లు సంయుక్తంగా మీడియా ద్వారా శుక్రవారం ముస్లిం ప్రజలకు రంజాన్ పండుగ సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లిం మైనార్టీ ప్రజలు రంజాన్ మాసంలో ఎంతో పవిత్రంగా భావించి కఠోర దీక్షలతో ఉపవాసం ఉండి ప్రార్థనలు కొనసాగించారు. అలాంటి ఈ పవిత్రమైన రంజాన్ పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ఎంతో ఆనందంగా సంతోషంగా ప్రతి ముస్లిం కుటుంబాలు ఎంతో ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. అల్లా దేవుడు దయతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం మరో 20 ఏళ్ల రాష్ట్రంలో ప్రజలకు సుపరిపాలన సాగించాలని ,రాష్ట్రం ఆర్థిక అభివృద్ధి వైపు ముందడుగు వేయాలని కోరుకున్నట్లు వారు తెలిపారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. రంజాన్ మాసంలో చాలా మంది ముస్లిం కుటుంబాలు వారికి ఉన్న శక్తి మేరకు పేదలకు కొంత ఆర్థిక సహాయం చేసి పుణ్య ప్రాప్తి లభించేలా ఈ పండుగను ఎంతో పవిత్రంగా జరుపుకుంటారని ఎమ్మెల్యే ,మాజీ మంత్రి పేర్కొన్నారు.

# గరికపాటి నరసింహారావు వెంటనే విద్యార్థి లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలి

**ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి**



**అనంతపురం, మార్చి 20 మనంన్యూస్ :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల మధ్యాహ్న భోజనంపై గరికపాటి చేసిన అవమానకర వ్యాఖ్యలను ఏఐఎస్ఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ కుల్లాయి స్వామి మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కేవలం ఆహారం మాత్రమే కాదు అది వారి ఆరోగ్య విద్యాభాసం భవిష్యత్తుకి బలమైన ఆధారం అలాంటి కీలకమైన పథకంపై విద్యార్థులు కేవలం కోడుగుడ్డులో కోసమే పాఠశాలలకు వస్తున్నారని చదువు విద్య అయిపోయిందని ఆయన వ్యాఖ్యానించడం విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయటమే కాకుండా సమాజంలో అసమానతలను మరింత పెంచే చర్యగా పరిగణించాలి. గరికపాటి చేసిన వాక్యాలు విద్యార్థుల ఆత్మ గౌరవాన్ని కించపరచడమే కాకుండా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల స్థితి గతులపై అలాగే పథకం యొక్క ప్రాథమిక ఉద్దేశంపై ఆయనకున్న అవగాహన రాహిత్యం అని ప్రతిభందిస్తుంది. విద్య అనేది ప్రతి ఒక్కరికి హక్కు ఆ హక్కును వినియోగించే విద్యార్థులకు ప్రభుత్వం అందించే మధ్యాహ్న భోజనం ఒక ముఖ్యమైన సంక్షేమ చర్య దానిని అవమానించడం అనేది సమాజంలోని బలహీన వర్గాలపై, వారి ఆహార అలవాట్ల పై చేస్తున్న దాడి చేస్తూ విద్యావ్యవస్థలో ఆర్ఎస్ఎస్ కాషాయీకరణ ఎజెండాను చూపించడమే భారత రాజ్యాంగ కల్పించిన విద్యా హక్కు చట్ట అమలు బాధ్యత పాలక ప్రభుత్వాలపై ఉంటుంది అందులో భాగంగానే విద్యార్థులు విద్యాభ్యాసానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది అందుకు అనుగుణంగానే పాఠశాలలో చదివే విద్యార్థులకు పుస్తకాలు బ్యాగులు యూనిఫాంలు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుంది అటువంటి పథకాలకు కూడా అసలు ఎందుకు అందించాలి అని గరికిపాటి గారు వ్యాఖ్యానించడం సిగ్గుమాలిన అహంకారి పూర్వ ధోరణితో బలహీనవర్గ వారికి విద్యను దూరం చేసే చర్యగా చూడాలి. గరికపాటి వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని విద్యార్థులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి లేని పక్షంలో తెలుగు రాష్ట్రాలలో మీరు ఎక్కడికి వెళ్లినా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసనలు తప్పవు. తక్షణమే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ గారు ఈ విషయంపై స్పందించి విద్యార్థులకు సంక్షేమానికి సంబంధించిన పథకాలపై అవమానకర వాక్యాలు చేసే వారిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




## అధికారుల అత్యవసర నిర్ణయాలతో

# ఉద్యోగులకు ప్రాణ సంకటం

**- రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు**

**గోరంట్ల మార్చి 20 మనంన్యూస్ :** ప్రభుత్వం ఈనెల 19 న ఉగాది రంజాన్ సందర్భంగా 20 న పాఠశాలలకు, ప్రభుత్వ కార్యాలయాలకు మొదట సెలవును అధికారులు ప్రకటించడం జరిగింది. దీనివలన ఉద్యోగ ఉపాధ్యాయులందరూ సొంత ఊర్లకి , బంధువుల ఊర్లకి వెళ్లడం జరిగింది. 20వ తేదీన పని దినంగా పరిగణించాలని, రంజాన్ సెలవును 21 కి మార్చడం జరిగిందని శుక్రవారం తెల్లవారుజామున అప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేశారు. దీని మూలంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు సుదూర ప్రాంతాల నుండి తాము పనిచేస్తున్న పాఠశాలలు, కార్యాలయాలకు నిర్ణీత సమయంలో చేరుకోవాలని తెల్లవారుజామున హుటా హుటిన బయలుదేరి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం సుమారు 6 గంటల 30 నిమిషాలకు మడకశిర మండలం నీలకంఠాపురం ఉన్నత పాఠశాలలో తెలుగు పాఠశాల సహాయకులుగా విధులు నిర్వర్తిస్తున్న జి.వేమ నారాయణ అనే ఉపాధ్యాయునికి ప్రమాదం జరిగింది. ఈయన ఈటీవలే ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విజేతైన సత్యసాయి జిల్లా జట్టు సభ్యుడుగా కూడా ఉన్నాడు.ఈయన ఉగాది పండుగ పర్వదినాన కుటుంబ సమేతంగా సొంత ఊరు అయిన తనకల్లు మండలం కేటిపల్లికి వెళ్లడం జరిగింది. రెండు రోజులపాటు సొంత ఊర్లో గడిపి శనివారం పాఠశాలకు వెళదామనుకున్నారు. అధికారుల అత్యవసర ఆదేశాలతో శుక్రవారం తెల్లవారుజామున 4:30 గంటలకే ద్విచక్ర వాహనంపై ఒంటరిగా బయలుదేరి వస్తుండగా గోరంట్ల గుమ్మయ్య గారిపల్లి సమీపం వద్ద నున్న ఆర్ పి వి సరోవర్ విల్లాస్ వద్ద ఒక స్థానిక ఆటో రాంగ్ రూట్ లో వచ్చి ఢీకొనడంతో తలకు గాయాలతో పాటు తన కుడికాలు పూర్తిగా విరిగిపోయే పరిస్థితి వచ్చింది. ఈ విషయాన్ని తెలుసుకున్న వెంటనే ఏపీ సిపిఎస్ ఈఏ సంఘ నాయకులు నీలం అశోక్ , బాలకృష్ణ , రవీంద్రలు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్సను చేయించడం జరిగింది. తదుపరి స్థానిక పోలీస్ స్టేషన్ నందు ప్రమాదానికి కారణమైన ఆటోపై కేసు నమోదు చేయించి , ప్రమాద బాధితుడని బంధువులకు అప్పగించి బెంగళూరు స్పర్శ్ ఆసుపత్రికి తరలించడం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇకనుండి అయినా అధికారులు ఇలాంటి తొందరపాటు నిర్ణయాలు మానుకోవాలని, ఏ నిర్ణయమైనా ముందు రోజే తీసుకోవాలని , అలాంటి అత్యవసర సందర్భాల్లో పరిహారపు సెలవు ప్రకటించి కుందేలను శారీరక, మానసిక ఒత్తిడి నుండి విముక్తి కలిగించాలని కోరారు.

# నిరుద్యోగులకు ఇది నిజమైన ఉగాది

**ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు**



**రాయదుర్గం మార్చి 20 మనంన్యూస్:** నిరుద్యోగుల ఆశలను నిజం చేస్తూ చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన జాబ్ క్యాలెండర్ నిరుద్యోగుల్లో కొత్త ఆశలు చిగురింపజేసిందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఇది నిజమైన ఉగాదని స్పష్టం చేశారు. రాయదుర్గం పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ… గత జగన్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను మాయమాటలతో వంచించిందని ఆరోపించారు. ఐదేళ్ల కాలయాపన చేస్తూ 13 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేసి, వారిని తీవ్ర నిరాశ నిస్పృహలకు గురి చేసిందన్నారు. ప్రభుత్వ శాఖల్లోని ప్రధాన స్థానాలన్నీ ఖాళీగా ఉండటంతో ప్రజలు అనేక రకాల ఇబ్బందులు పడ్డారన్నారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే నిరుద్యోగులకు ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టడం గొప్ప విషయమన్నారు. రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ బాబు సహకారంతో 20 నెలల కాలంలో ఆరు లక్షలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. ప్రభుత్వ రంగంలోనే 30 వేల పోస్టులు భర్తీ చేయడం జరిగిందన్నారు. ఉగాది పండుగ సందర్భంగా సుమారు పదివేల పోస్టుల భర్తీకి తాజాగా జాబ్ క్యాలెండర్ ప్రకటించి ప్రభుత్వం విశ్వసనీయతను చాటుకుందన్నారు. మంచి పాలనతో పెట్టుబడిదారులకు రాష్ట్రాన్ని స్వర్గధామంగా మార్చడంతో పరిశ్రమల స్థాపనకు పెట్టుబడిదారులు ముందుకు వచ్చారన్నారు. పరిశ్రమల ఏర్పాటు పూర్తి అయితే పారిశ్రామిక రంగంలోనే దాదాపు 25 లక్షల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయన్నారు. తాజా జాబ్ క్యాలెండర్ ద్వారా గ్రూప్-1, గ్రూప్-2 తో పాటు పలు కీలక శాఖల్లో 10,060 పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యాశాఖలో ఉపాధ్యాయులతో పాటు జూనియర్ లెక్చరర్లు, ప్రొఫెసర్ల వంటి కీలక విభాగాల్లో శాశ్వత ఉద్యోగాలను భర్తీ చేయడం జరుగుతోందన్నారు. ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు చేపడుతున్నామన్నారు. చంద్రబాబు నాయకత్వంలో నిరుద్యోగుల భవిష్యత్తుకు చక్కటి భరోసా లభిస్తుందని తెలిపారు. అనేకమంది ప్రతిభావంతులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. నియామకాల్లో చిన్న లోపం కూడా తలెత్తకుండా అత్యంత పారదర్శకంగా ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. చంద్రబాబు ప్రభుత్వానికి నిరుద్యోగులు అండగా ఉండాలని, వారి తల్లిదండ్రులు నిండు మనసుతో ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కాలవ విన్నవించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు కాలవ భరత్, పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, ప్రధాన కార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు.

## ధర్మవరంలో జిల్లా స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు



**కదిరి, మార్చి20 మనంన్యూస్:** జిల్లా స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు ఈనెల 24-03-2026 తేదీన ఉదయం 8:00 గంటలకు ధర్మవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించబడనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి. కిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో పురుషులు 45 సంవత్సరాలు పైబడిన వారు, మహిళలు 35 సంవత్సరాలు పైబడిన వారు పాల్గొనవచ్చని తెలిపారు. పోటీలలో 100, 400, 800, 1500 మీటర్ల పరుగు పందేలు, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, హైజంప్, జావెలిన్ త్రో, 4x100 మీటర్ల రిలే పోటీలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 30, 31 తేదీలలో గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించబడే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు. పాల్గొనదలచిన క్రీడాకారులు తప్పనిసరిగా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వెబ్‌సైట్ https://sports.ap.gov.in లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

# బాబుతోనే జాబు'ను నిజం చేస్తున్నాం... ఏటా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు

**- మాట తప్పిన జగన్**
**- హామీని నిలబెట్టుకున్న లోకేశ్**
**- మంత్రి సవితమ్మ...**




**సోమందేపల్లి టౌన్ మార్చి 20 మనంన్యూస్:** బాబుతోనే జాబు గ్యారంటీ అనే నినాదాన్ని నిజం చేస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఏటా ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగ యువతను జగన్ మోసం చేస్తే, టీచర్, పోలీసు, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి మంత్రి నారా లోకేశ్ మాట నిలబెట్టుకున్నారని కొనియాడారు. అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న మాటను నిలబెట్టుకుంటామని స్పష్టంచేశారు. సోమందేపల్లి మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ పథకాలు విజయవంతం చేశామని, ఉగాది సందర్భంగా దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కోసం దివ్యాంగుల శక్తి పథకానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని తెలిపారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత ఇసుక, అన్న క్యాంటీన్లు, పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం, రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల నిర్మాణం ఇలా అభివృద్ధిని, సంక్షేమాన్ని సీఎం చంద్రబాబు పరుగులు పెట్టిస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామంటూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని మంత్రి నారా లోకేశ్ నిలబెట్టుకున్నారని మంత్రి సవిత తెలిపారు. 10,060 ఉద్యోగాల భర్తీకి ఉగాది సందర్భంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేశారన్నారు. ఇది రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు శుభవార్తని అన్నారు. అధికారంలోకి రాగానే 16 వేలకు పైగా టీచర్ పోస్టులు భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహించారన్నారు. జగన్ సహా వైసీపీ నాయకులు కోర్టుల్లో ఎన్ని కేసులు వేసినా, వాటిన్నింటినీ అధిగమించి మెగా డీఎస్సీ నిర్వహించారని మంత్రి నారా లోకేశ్ ను కొనియాడారు. అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న మాటను నిలబెట్టుకుంటామని మంత్రి సవిత స్పష్టం చేశారు. బాబుతోనే జాబ్ గ్యారంటీని అనే నినాదాన్ని మాటలతో సరిపెట్టకుండా నిజం చేస్తున్నామన్నారు. ఏటా ఉద్యోగాలు భర్తీ చేస్తామంటూ నిరుద్యోగ యువతను జగన్ మోసం చేశారని మండిపడ్డారు. సోమందేపల్లిలో వెలసిన చౌడేశ్వరీ దేవిని మంత్రి సవిత సందర్శించారు. జాతర ఘనంగా భక్తిశ్రద్ధలతో జరుగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులను అభినందిస్తూ, జాతర సజావుగా నిర్వహణకు ఆలయం వరకూ సీసీ రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. సోమందేపల్లి మండల కేంద్రంలో రూ.2.50 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి కల్పన వంటి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రాష్ట్రంపై చౌడేశ్వరీ దేవి కృప ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. మంత్రి సవిత వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు, చౌడేశ్వరీ దేవి ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అక్కమ్మ దేవతల ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలి : ఎమ్మెల్యే అమిలినేని



**కళ్యాణదుర్గం మార్చి 20 మనం న్యూస్ :** కళ్యాణదుర్గం ప్రాంతంలో అత్యంత ప్రాచీనమైన, భక్తుల పాలిట కొంగు బంగారం శ్రీనా అక్కమాంబ జాతర సందర్భంగా అమ్మవార్లకు కళ్యాణదుర్గం నియోజకవర్గ శాసనసభ్యులు అమిలినేని సురేంద్ర బాబు , వారి సతీమణి రమాదేవి స్థానిక టీడీపీ నాయకులతో కలసి వారి స్వగృహం నుంచి అమ్మవారి కలశంతో పాటు పట్టు వస్త్రాలు తీసుకువచ్చి సమర్పించి అమ్మవారి దర్శనం చేసుకున్నారు..నియోజకవర్గంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, వర్షాలు సకాలంలో కురిసి పాడిపంటలతో రైతులు సంతోషంగా ఉండాలని అమ్మవారికి మొక్కుకున్న ఎమ్మెల్యే ..అనంతరం ఆలయం వద్ద అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఏర్పాటు చేసిన అన్నప్రసాద కేంద్రం వద్ద భక్తులకు అన్నప్రసాదం వడ్డించి, అక్కడే ఆయన కూడా అన్నప్రసాదం స్వీకరించడం జరిగింది..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , మంత్రి నారా లోకేష్ సహకారంతో అమ్మవారి కృపాకటాక్షాలతో కళ్యాణదుర్గం అభివృద్ధి బాటలో నాడవాలని, అందుకు అధికారులు కూడా పూర్తి సహకారం అందించాలన్నారు..మొదటి ఏడాది బాగా పనిచేసినా

**-అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించే అదృష్టాన్ని కల్పించిన కళ్యాణదుర్గం ప్రజలకు ఋణపడి ఉంటా**
**-అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే అమిలినేని దంపతులు**
**- ఆలయం వద్ద పెద్ద ఎత్తున భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే**
**- అమ్మవారి అనుగ్రహంతో బీటీపీ రైతులకు పరిహారం అందించాలని ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రులను కోరుతున్నా**
**త్వరలోనే రైతులకు పరిహారం అందించేందుకు కృషి చేస్తా**
**- అక్కమ్మ ఆశీస్సులతో బీటీపీ పనులు మరింత వేగంగా సాగాలని మొక్కుకున్నా**
**-అభివృద్ధికి అధికారులు సహకరించి, ప్రజల క్షేమం కోసం పనిచేయాలి**
**-అధికారులకు చేతులెత్తి నమస్కరిస్తున్నా సమస్యల పరిష్కారం కోసం పనిచేయండి**
**-మొదటి ఏడాది బాగా పనిచేశారు..ఈ ఏడాది సరిగా పనిచేయడం లేదు**
**-తాగునీటి సమస్య ఉందని తెలిసినా అధికారులు పట్టించుకోకపోతే నాయకులే స్వంత ఖర్చులతో బోర్లు వేసి నీటిని అందిస్తున్నారు..**
**-మన ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా ముఖ్యమంత్రి అభివృద్ధి చేయబోతున్నారు**
**-పార్టీలకు అతీతంగా అభివృద్ధిలో ముందుకు సాగాలి..**
**- ఆలయం వద్ద వచ్చే జాతర నాటికి వంటగది, భోజనశాల ఏర్పాటు చేస్తాం**
**- అక్కమాంబ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, దర్శించుకున్న ఎమ్మెల్యే అమిలినేని దంపతులు**

రెండవ ఏడాదికి వచ్చేటప్పటికి అధికారుల పనితీరు బాగిలేదని, మార్చుకుని సమస్యలు ఎక్కడ ఉన్నాయో గుర్తించి వెంటనే పరిష్కరించాలని, కళ్యాణదుర్గం పట్టణంలో డంప్ యార్డు గురించి పదే పదే నేనే అడుగుతున్నా, అధికారులు



స్పందించడం లేదన్నారు..అమ్మవారి ఆశీస్సులతో బీటీపీ కాలువ పనులు మరింత వేగంగా జరిగి పనులు పూర్తి అయి మన ప్రాంతం సస్యాశ్యామలం అవ్వాలని అమ్మవారికి మొక్కుకున్నానని, ఇప్పటికే ఆలయం వద్ద వంటగది, భోజనశాల పూర్తి చేయాలి అనుకున్నా ఆలయ కమిటీ ఎన్నిక కావడం కొత్త కమిటీకి, ఈఓ కి అమ్మవారికి సంబందించినవి అందించడంలో కొంత ఆలస్యం అయిందని వచ్చే జాతర నాటికి తప్పకుండా వంటగది, భోజనశాల నిర్మిస్తామని తెలిపారు.




## పంటల్ని పరిశీలించిన ఎమ్మెల్యే బండారు శ్రావణి

**నార్పల మార్చి 20 మనం న్యూస్ :** అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ శుక్రవారం రోజు పరిశీలించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ అధికారులతో పాటు టిడిపి నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమని తెలిపారు. రైతులకు ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు న్యాయం జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరస నాయుడు, మైనార్టీ నాయకులు గూగూడు జాఫర్ వలి, సింగిల్ విండో చైర్మన్ మహేష్ నాయుడు, పాల్గొన్నారు.



### చౌడేశ్వరి దేవి పంచమ జ్యోతుల

## మహోత్సవంలో మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

**గజమాలతో స్వాగతం పలికిన జడ్పిటిసి డిసి అశోక్..**

**సోమందేపల్లి టౌన్ మార్చి 20 మనం న్యూస్:** శ్రీ చౌడేశ్వరి అమ్మవారి పంచమ జ్యోతుల మహోత్సవ కార్యక్రమంలో మాజీమంత్రి ఉషశ్రీ చరణ్ శుక్రవారం తెల్లవారుజామున పాల్గొన్నారు. సందర్భంగా మండల జెడ్పిటిసి డిసి అశోక్, పట్టణ ఉపాధ్యక్షుడు గట్ట మంజు , గజమాలతో గ్రామ పొలిమేరలలో ఆమెకు ఘన స్వాగతం పలికారు. వందలాది మంది అభిమానులు వెంటరాగా ఉషాశ్రీ చరన్ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని దర్శించుకున్నారు. పంచమ జ్యోతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. సందర్భంగా ఆమెకు తొగట వీర క్షత్రియులు డిసి అశోక్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాత ఊర్లో వెలసినపురాతన చౌడేశ్వరి దేవి ఆలయంలో మాజీ మంత్రివర్యులు ఉషాశ్రీ చరణ్ గారు డిసి అశోకు తో కలిసి ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు ఉషశ్రీ చరణకు మద్దతు పలికారు. మాజీ ఎంపీపీ డిసి వెంకటేశులు స్వగృహంలో వారింట విందును ఆమె ఆరగించారు. పార్టీ స్థితిగతులపై వారితో చర్చించారు. పూజలో ఆమెతో కలిసి పాల్గొన్న వారిలో పలువురు వైసిపి నాయకులు అభిమానులు ఉన్నారు.



